క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో చాతుర్మాస దీక్షల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీనివాస హోమం, సుదర్శన హోమం జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణం వైభవంగా జరిపించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేషంగా అభిషేకాలు



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం : అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెందుర్తి : దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 80వ జయంతి సందర్భంగా చినముషిడివాడలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు మంగళవారం పూలమాల వేసి అంజలి ఘటించారు. కాంగ్రెస్ నాయకులు విన్నకోట రాము, ముక్క రామునాయుడు, ఆర్.ఆర్ నాయుడు, ఎం.వి. పాత్రుడు, కె.వరప్రసాదరావు, ఎండీ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసగించిన ఇద్దరి అరెస్ట్

తగరపువలస: రైల్వేలో ఉద్యోగాల పేరుతో మోసగించిన ఇద్దరు వ్యక్తులను ఆనందపురం పోలీసులు మండలంలోని వెల్లంకి రోడ్డు వద్ద మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.15 వేలు రికవరీ చేశారు. ఆనందపురం సీఐ టీవీ తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన ఎద్దు వెంకటలక్ష్మిని నగరంలోని నీలమ్మ వేపచెట్టు ప్రాంతానికి చెందిన దాదిరావు నరేంద్ర కుమార్ పట్నాయక్, పెందుర్తి సుజాతనగర్‌కు చెందిన సుగ్గు వెంకట శ్రీధర్ నమ్మించారు. ఆమె నుంచి ఈ నెల 14న డబ్బు వసూలు చేశారు. తర్వాత విచారించగా తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు దిశ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ జి.మల్లేశ్వరిని ఆశ్రయించారు. ఆమె సూచనల మేరకు బాధితురాలు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును సీఐలు టీవీ తిరుపతిరావు, జి.మల్లేశ్వరి, ఎస్ఐలు పి.శివ, ఎన్.గౌరి, హెడ్ కానిస్టేబుల్ ఎస్.వాసు, కానిస్టేబుల్ కె.బాలకేశవ విచారించి, నిందితులను అరెస్ట్ చేశారు.

దోమల నియంత్రణతో వ్యాధుల నుంచి రక్షణ

పెదగంట్యాడ: దోమలే అనేక వ్యాధులకు కారణమని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు దేవాడ పీహెచ్‌సీ వద్ద మంగళవారం అంతర్జాతీయ దోమల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులను అరికట్టేందుకు దోమల నియంత్రణే ఉత్తమ మార్గం అన్నారు. అనంతరం దేవాడ పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

2019 నాటికి: పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిల స్థితిలో ఉంది. తరగతి గదులు లేక, ఉన్నా కూర్చోవడానికి వీలు లేక, మరుగుదొడ్లు కట్టక, కనీసం తాగునీరు ఏర్పాటు చేయక దయనీయ స్థితిలో ఉండేది. నాటి ప్రభుత్వం కళాశాలపై శీతకన్ను వేయడంతో విద్యార్థులు ఇక్కడ చేరేందుకు ఆసక్తి చూపించని పరిస్థితి. ఈ నేపథ్యంలో కళాశాల కళాకాంతులు లేకుండా ఉండేది.

2019-24 మధ్య: కళ తప్పిన కళాశాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవం పోసింది. కళాశాల దుస్థితిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం పాఠశాలల నాడు-నేడు ఫేజ్-2లో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.1.79 కోట్లు విడుదల చేసింది. కళాశాలలో ప్రాథమిక సదుపాయాల కల్పనకు ఆయా నిధులను కేటాయించింది. దీంతో కళాశాల కొత్త హంగులు సంతరించుకుంటున్న తరుణం. దాదాపు 60 శాతం నిధులు విడుదల కావడంతో పనులు చురుగ్గా సాగుతున్న వేళ..

తాజా పరిస్థితి: మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. నాడు-నేడు పనులు చురుగ్గా సాగుతున్న వేళ మిగిలిన నిధులు విడుదల కాలేదు. దీంతో ప్రస్తుతం ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కళాశాలలో 2019 ముందు నాటి పరిస్థితులే ఏర్పడ్డాయి. విద్యార్థినుల కోసం నిర్మిస్తున్న మరుగుదొడ్ల పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కళాశాలలో ఏ మరుగుదొడ్డికీ రన్నింగ్ వాటర్ సదుపాయం లేదు. ప్రహరీ నిర్మాణం కోసం నిధులు నిలిచిపోవడంతో ఆకతాయిల బెడద యథావిధిగా ఉంది. కొద్ది రోజుల క్రితం కళాశాల నుంచి బహిష్కరించబడిన విద్యార్థి మద్యం సేవించి ఏకంగా కళాశాల ప్రాంగణంలోనే వీరంగమాడాడంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

కళాశాలలో సమస్యల కొలువు

- ఆగిపోయిన అభివృద్ధి పనులు
- రన్నింగ్ వాటర్ సదుపాయం లేక విద్యార్థినుల ఇక్కట్లు
- ప్రహరీ లేకపోవడంతో పేట్రేగిపోతున్న ఆకతాయిలు



ప్రహరీ లేని పెందుర్తి జూనియర్ కళాశాల ప్రాంగణం

పెందుర్తి: 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో కళాశాలను అభివృద్ధి చేస్తామని ప్రకటనలు చేయడమే తప్ప ఆచరణలో చూపలేదు. ఎన్నోసార్లు కళాశాలలో కార్యక్రమాలకు హాజరైన అప్పటి టీడీపీ ప్రజాప్రతినిధులు ఇక్కడి పరిస్థితిని నేరుగా చూసినా కళాశాలలో సౌకర్యాల కల్పనకు ఆసక్తి చూపలేదు. అనేకసార్లు విద్యార్థులు, అధ్యాపకులు టీడీపీ ప్రజాప్రతినిధులకు సమస్యల పరిష్కారానికి విన్నవించినా ఫలితం లేదు. అప్పట్లో కనీసం తాగునీటి సదుపాయం కూడా కల్పించలేదంటే టీడీపీ సర్కారు విద్య, విద్యార్థుల పట్ల నిర్లక్ష్య ధోరణితో ఉండేదో అర్థం అవుతుంది.

మాటిచ్చారు..నిలబెట్టుకున్నారు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక విద్యకు ఇచ్చిన ప్రాధాన్యం దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఈ క్రమంలో పెందుర్తి నియోజకవర్గంలో పాఠశాలల మరమ్మతులకు రంగం సిద్ధం చేసిన తరుణంలో జూనియర్ కళాశాల పరిస్థితిని కొందరు అధ్యాపకులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే నాడు-నేడు ఫేజ్-2లో జూనియర్ కళాశాలలో వసతుల కల్పనకు రూ.1.79 కోట్ల నిధులు విడుదల చేసింది ప్రభుత్వం. ఆయా నిధులను 7 రకాల సౌకర్యాలకు కేటాయింపులు చేశారు. తక్షణ నిధుల సర్దుబాటు కింద దాదాపు రూ.70 లక్షల వరకు విడుదల చేసి పనులు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు.

- కళాశాలలోని అన్ని తరగతి గదుల్లో గ్రీన్ చాక్‌బోర్డుల ఏర్పాటుకు రూ.3,13,176 కేటాయించగా, ఏడు నెలల క్రితమే 64 బోర్డులు ఏర్పాటు చేశారు.
- ఫర్నిచర్ ఏర్పాటుకు రూ.37,84,342 కేటాయించారు. కొన్ని గదుల్లో ఏడు నెలల క్రితమే ఫర్నిచర్ అమర్చారు. తాజాగా నిధులు రాకపోవడంతో ఆ పనులు నిలిచిపోయాయి.
- విద్యార్థులు, విద్యార్థినులకు వేర్వేరుగా మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.13,02,154 కేటాయించారు. ఏడు నెలల క్రితమే మరుగుదొడ్ల నిర్మాణం 95 శాతం పూర్తయింది. రన్నింగ్ వాటర్ కోసం పైప్‌లైన్ కనెక్షన్లు ఇస్తే అవి పూర్తిస్థాయిలోకి అందుబాటులోకి వచ్చేస్తాయి. కానీ ప్రస్తుతం ఆ పనులు కూడా నిలిచిపోయాయి.
- కళాశాల మొత్తానికి పూర్తిస్థాయి విద్యుత్ సదుపాయం కోసం రూ.9,12,709 కేటాయించారు. 70 శాతం పనులు పూర్తి కాగా ప్రస్తుతం మిగిలిన పనులు నిధుల కొరతతో ఆగిపోయాయి.
- విద్యార్థులు, సిబ్బందికి సురక్షిత తాగునీటిని అందించేందుకు రూ.7,71,493 కేటాయించగా..ఆయా నిధులతో ఏడు నెలల క్రితమే రెండు ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కళాశాలలో తాగునీరు పూర్తిస్థాయిలో అందుతోంది.
- కళాశాల మొత్తానికి రంగులు వేసేందుకు రూ.38,25,195 కేటాయించారు. అయితే నిధులు నిలిచిపోవడంతో అరకొర పనులతోనే రంగుల ప్రక్రియ ఆగిపోయింది.
- ఇతర చిన్నా, పెద్ద నిర్వహణ పనులకు రూ.70,37,370 కేటాయించారు. కొంత నిధులతో కళాశాలలో ఏడు నెలల క్రితమే అన్ని గదులకు గ్రానైట్‌తో ఫ్లోరింగ్ వేశారు. తలుపులు, కిటికీలు, గ్రిల్స్ ఏర్పాటు చేశారు. ఇతర చిన్నాచితకా పనులు ఈ విద్యా సంవత్సరంలో పూర్తవుతాయన్న తరుణంలో నిధుల నిలుపుదలతో పనులన్నీ ఎక్కడిక్కడే నిలిచిపోయాయి.



పెందుర్తి జూనియర్ కళాశాల



మధ్యలో నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణం

ఆకతాయిల జోరు

కళాశాలకు ప్రహరీ అవసరం ఉంది. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు నిధులను సర్దుబాటు చేసి ప్రహరీ నిర్మాణం చేపడదాం అనుకున్నారు. కానీ తాజాగా ప్రభుత్వం నిధులు నిలిపివేయడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. కళాశాలకు రక్షణ గోడ లేక ఆకతాయిల జోరు పెరిగిపోతుంది. తరగతి గదుల్లోనే తాగుడు, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కొద్ది రోజుల క్రితం కళాశాల బహిష్కృత విద్యార్థి పూటుగా మద్యం సేవించి నేరుగా కళాశాల ప్రాంగణంలోనే వీరంగం సృష్టించి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేశాడు. రాత్రి సమయంలో ఇక్కడ ఆకతాయిలకు అడ్డే లేదని విద్యార్థులు వాపోతున్నారు. మిగిలిన నిధులు విడుదల చేసి కళాశాలలో సదుపాయాలతో పాటు ప్రహరీని నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు



తుప్పలు తొలగిస్తున్న పెందుర్తి క్రైం బ్రాంచ్ సిబ్బంది

పెందుర్తి : దొంగతనాలు, ఇతర నేరాల నియంత్రణకు క్షేత్రస్థాయిలో పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు వెస్ట్ జోన్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నేరాల నియంత్రణలో భాగంగా జనావాసాల్లో పెరిగిపోయిన తుప్పలను పెందుర్తి క్రైం బ్రాంచ్ పోలీసులు శ్రమదానం చేసి మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగలు సమీపంలోని తుప్పల్లో మాటు వేసి సమయం చూసుకుని చోరీలకు పాల్పడే అవకాశాలు ఉన్నట్లు భావిస్తున్నామన్నారు. అందుకే జనావాసాల్లో తుప్పలు తొలగించే ప్రక్రియను ప్రారంభించామన్నారు. ప్రజలను భాగస్వాములను చేసుకుని నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు



గొటివాడలో డాక్టర్ స్వర్ణలత ఆధ్వర్యంలో పాడి పశువుకుల టీకాలు వేస్తున్న సిబ్బంది

సబ్బవరం : మండలంలోని గోటివాడ గ్రామంలో పాడి పశువులకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధికి మంగళవారం టీకాలు వేశారు. ఈ నెల 20 నుండి వచ్చే నెల 18 వరకూ గాలికుంటు వ్యాధి టీకాలతో పాటు 4 నుండి 8 నెలల వయసు గల ఆడపెయ్యలకు బ్రూసెల్లా టీకాలు వేయనున్నట్లు పశు వైద్యరాలు డాక్టర్ స్వర్ణలత తెలిపారు. అదే విధంగా గోటివాడతో పాటు అంతకాపల్లి, గుల్లేపల్లి గ్రామాల్లో సుమారు 150 పాడి పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. మండలంలోని పాడి రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది కె. వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



నరవలో వరినాట్లను పరిశీలిస్తున్న అధికారులు

పెందుర్తి : మెరుగైన యాజమాన్య పద్ధతులతో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి అన్నారు. అందుబాటులో ఉన్న ఆధునిక వనరులను వినియోగించుకుని వ్యవసాయం చేయడం వల్ల రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని చెప్పారు. నరవలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ఊపందుకున్న తరుణంలో రైతు కూలీల కొరత ఉన్నందున వరినాట్లు వేసే యంత్రం రైతాంగానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎకరా విస్తీర్ణంలో వరి నాట్లు వేయడానికి ఈ యంత్రం ద్వారా రూ.4 వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. ఈ యంత్రం ద్వారా రోజుకు 6-8 ఎకరాల్లో వరినాట్లు వేసుకోవచ్చని చెప్పారు. వ్యవసాయ పనులు వేగంగా, సుఖవంతంగా పూర్తవుతాయని వివరించారు. ఈ సందర్భంగా సాగుకు సంబంధించి రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఏడీఏలు డీఆర్‌సీ సుబ్రహ్మణ్యం, హరికృష్ణ, మాణిక్యాంబ, మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్, ఏఈవో ఎన్.రమణ, ఎంపీఈవో టి.లోకేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

15న ‘టెంట్ ఎక్స్‌పో’



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

సీతమ్మధార : వైజాగ్ పటం ఫంక్షన్ మెటీరియల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15 ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో ‘టెంట్ ఎక్స్‌పో’ నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు సీహెచ్‌వీ సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు సీతమ్మధారలోని ఫంక్షన్ హాలులో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటి సారిగా భారీ స్థాయిలో ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని, అలాగే సభ్యుల సంక్షేమాన్ని కోరుతూ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సప్లయర్స్ రంగాన్ని చిన్న తరహా పరిశ్రమగా గుర్తించాలని కోరారు. సంస్థ కార్యదర్శి బి.సాయిబాబా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి వివిధ జిల్లాల్లో ఏర్పాటైన సప్లయర్స్ అసోసియేషన్ల కార్యవర్గ సభ్యులు అందరూ కలిసి వెయ్యి మందికి పైగా హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్.గిరిధర్, ఎస్.చిట్టిబాబు, జి.శ్రీనివాస్, ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు.

పద్యపఠన, వ్యాస రచన పోటీలకు ఆహ్వానం

తగరపువలస: ఈ నెల 29న తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన విహార్ ఆధ్వర్యంలో తెలుగుభాష ఆవశ్యకతపై విద్యార్థులకు పద్యపఠన, వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 27న ఉదయం 9.30 గంటలకు స్కూల్ వద్ద ఈ పోటీలు నిర్వహిస్తారు. 5 నుంచి 7వ తరగతి విద్యార్థులకు ఒక వర్గంగా, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మరో వర్గంగా ఈ పోటీలు నిర్వహించనున్నారు. వివరాలకు 80746 33106, 70134 11907 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ఘనంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందజేశారు.

దోమల నివారణకు జాగ్రత్తలు పాటించాలి



పరవాడలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

పరవాడ: దోమల నివారణకు గ్రామీణ ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హారిక సూచించారు. ప్రపంచ దోమల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ సిబ్బంది పరవాడలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హారిక మాట్లాడుతూ వర్షాకాలంలో పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిఉండడం వలన దోమలు పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. దోమలు కుట్టడం వలన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా (బోదకాలు), మెదడువాపు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో పాడైన సామగ్రి, పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు, నీరు నిల్వ ఉన్న గోళాల వలన దోమలు పెరిగే అవకాశాలు ఉన్నాయని, అందువల వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమల రహిత సమాజం ఆరోగ్యానికి సోపానమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జయశ్రీకరిష్మా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.ఎస్.ఎస్.సాయిరాం, పి.హెచ్.ఎన్.జానకీ రామన్, హెల్త్ సూపర్‌వైజర్లు ఎం.ఎస్.సతీష్, పి.వి.రత్నం, స్టాఫ్ నర్స్ చైతన్య, ఆప్తాల్మిక్ ఆఫీసర్ వెంకటరావు, ఎల్.టి.అన్నపూర్ణేశ్వరి పాల్గొన్నారు.

బంగారమ్మ తల్లికి పసుపు కుంకుమలు



ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ తల్లి

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం గ్రామదేవత బంగారమ్మ తల్లి వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ వాసులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. గులాబీ, బంతి, చామంతి పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం వద్ద నేలవేషాలు, బాణసంచా, పులివేషాలతో సందడి కనిపించింది.

శిథిల రహదారులతో చిక్కులు

- ధ్వంసమైన లంకెలపాలెం కూడలి రహదారి
- గుంతలు పడిన మడకపాలెం రోడ్డు



మడకపాలెం వద్ద అధ్వానంగా మారిన రహదారి



లంకెలపాలెం కూడలిలో భారీ గుంతలతో శిథిలమైన రోడ్డు

పరవాడ: లంకెలపాలెం-అసకపల్లి రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్టీపీసీ ఫ్లైయాష్ చెరువుల నుంచి వందల సంఖ్యలో బూడిద లారీలు నిత్యం ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుండడంతో రహదారి మొత్తం ధ్వంసమైంది. ఎక్కడికక్కడ భారీ గుంతలు, బీటలు పడడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని పలువురు వాపోతున్నారు. లంకెలపాలెం కూడలిలో ఏర్పడిన భారీ గుంతలు ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఈ గోతుల్లో పడి బోల్తా పడుతున్నాయి. మడకపాలెం వద్ద పరుజులో భారీ గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి వేళల్లో ప్రయాణికులు ఈ గుంతలను గుర్తించకుండా రాకపోకలు సాగించడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. పెదముషిడివాడ వద్ద భారీ గుంతలు ఏర్పడిన కారణంగా అనేక గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అదే విధంగా బూడిద లారీల ద్వారా ఎగసి పడుతున్న దుమ్ము, ధూళి కారణంగా అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన రహదారుల గురించి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ కనీస చర్యలు తీసుకోలేదని ప్రజలు వాపోతున్నారు. ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి శిథిలమైన రోడ్లకు మరమ్మతులు నిర్వహించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎల్ అండ్ టీ డీజీఎం శ్రీనివాసరావు

అగనంపూడి: బాలికల ఆరోగ్యంతో పాటు బాలికలకు ఆరోగ్య సూత్రాలు తల్లులు తెలియజేయాలని ఎల్‌అండ్‌టీ డీజీఎంలు ఈ.శ్రీనివాసరావు, రామకృష్ణ అన్నారు. బాలికలు రక్తహీనతను అధిగమించడానికి తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఎల్‌అండ్‌టీ, సృజన స్రవంతి సంస్థ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. బాలికలకు ఆరోగ్యపరమైన సూచనలు, సలహాలు తల్లులు మాత్రమే అందివ్వగలరని, దీన్ని దృష్టిలో పెట్టుకొని తల్లులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. బలవర్ధకమైన ఆహారం తీసుకోకపోవడం వల్ల రక్తహీనత ఏర్పడుతుందన్నారు. ఎల్‌అండ్‌టీ సహకారంతో సృజన స్రవంతి సంస్థ అందించిన రూ.35వేల విలువైన శానిటరీ నాప్‌కిన్ల బర్నింగ్ మిషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.కృష్ణారావు, సృజన స్రవంతి సంస్థ అధికారి హరనాథ్ మెహర్జీ, కమిటీ చైర్మన్ అట్టా శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ కె.రమాదేవి, ఉపాధ్యాయులు కృష్ణవేణి, ఆశాలత, అరుణ కుమారి పాల్గొన్నారు.

‘రన్ ఫర్ యాంటీ డ్రగ్స్’ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్ తదితరులు

అగనంపూడి: మత్తు పదార్థాల నివారణ, మాదకద్రవ్యాలను అరికట్టేందుకు ఈనెల 25న నిర్వహించనున్న రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ అవగాహన ర్యాలీని విజయవంతం చేయాలని అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.సుధాకర్‌బాబు కోరారు. పల్లా కార్తీక్ చారిటబుల్ ట్రస్ట్ సారథ్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేకంగా నిర్వహించనున్న ర్యాలీ వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. ట్రస్ట్ చైర్మన్ కార్తీక్ మాట్లాడుతూ పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకు నిర్వహించనున్న రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొంటారన్నారు. అగనంపూడి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం.మస్తాన్‌రెడ్డి, జేసీఐ వైజాగ్ స్టీల్ ఉపాధ్యక్షుడు ఎస్.రవికుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.